ప్రజాశక్తి
శనివారం 8 జూన్ 2024 5 అనంతపురం



వేట కొడవళ్లతో వీరంగం అసత్య ప్రచారమే : ఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న సత్యసాయి జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రామగిరి మండలం సుద్దుకుంటపల్లి తండాలో వేట కొడవళ్లు పట్టుకొని వీరంగం సృష్టిస్తున్నారంటూ ఓ న్యూస్ చానెల్లో వచ్చిన కథనంలో ఎటువంటి వాస్తవం లేదని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి వివరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దీనిపై పోలీసు శాఖ వెంటనే విచారణ చేపట్టిందన్నారు. ఈనెల 4 వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఫలితాల అనంతరం తమ పార్టీ అభ్యర్థి గెలుపొందన్న ఆనందంతో రామగిరి మండలం సుద్దగుంటపల్లి తండాలో ఆ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారే తప్ప, ఎవ్వరిని భయభ్రాంతులకు గురి చేయలేదని తమ విచారణలో తేలిందన్నారు. ఈ సందర్భంగా పొట్టేలును కోసుకునే సందర్భంలో మచ్చు కత్తులు పట్టుకున్నారే తప్ప ఎలాంటి వీరంగం సృష్టించే ఉద్దేశం లేదని పోలీసుల విచారణలో తేలిందని ఎస్పీ వెల్లడించారు. దానిని వక్రీకరించి ప్రత్యర్థులను బెదిరించడానికి, గ్రామంలో భయానక వాతావరణం సృష్టించడానికి వేట కొడవలళ్లతో వీరంగం చేశారని ప్రచారం చేశారని వివరించారు. అయితే ఆరోజు జరిగిన సంబరాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ అనంతరం జిల్లావ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసుల అన్ని భద్రత చర్యలు చేపట్టిందని ఎస్పీ వివరించారు.

దంచికొడుతున్న వాన



- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు
- సీజన్ ప్రారంభంలోనే ఆశాజనకం
- శ్రీసత్యసాయి జిల్లాలో 77.6 మి.మీ వర్షపాతం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడురోజులుగా వర్షం దంచికొడుతోంది. సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే నమోదయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. చెక్‌డ్యాములు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. కర్నాటక రాష్ట్రానికి దిగువనున్న ప్రాంతాల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అనంతపురం జిల్లాలోని డి, హీరేహాల్ మండలంలోని సోమలాపురం వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడుతుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఆశాజనకంగా వర్షాలు పడుతుండటంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయి. రెండు,మూడు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి మంచి వర్షపాతం నమోదయింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా సాధారణంగా ఈ వారం రోజుల్లో 20 మిల్లిమీటర్లు కురవాల్సిన చోట 66.1 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. శుక్రవారం సాయంత్రం నుంచి కూడా జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వర్షపాతం నమోదవుతూనే ఉంది. సీజన్ ప్రారంభంలోనే ఇటువంటి వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు వర్షం ఆగిన తరువాత విత్తనం విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు.

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు

అనంతపురం జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాలు నమోదయిన వర్షపాతం చూస్తే శెట్టూరులో గరిష్ఠంగా 71.5 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. బ్రహ్మసముద్రంలో 48 మిల్లిమీటర్లు నమోదయింది. బుక్కరాయసముద్రంలో 45 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదవగా రాయదుర్గంలో 33.75 మిల్లిమీటర్లు వర్షపాతం పడింది. ఇక సత్యసాయి జిల్లాలో మరింత ఎక్కువగా వర్షపాతం నమోదయింది. నల్లచెరువులో 83.5 మిల్లీమీటర్లు పడగా, తనకల్లులో 74.75 మిల్లిమీటర్లు, సోమందేపల్లి 74 మిల్లిమీటర్లు, బత్తలపల్లిలో 68,25 మిల్లిమీటర్లు, తనకల్లులో 64 మిల్లిమీటర్లు, పుట్టపర్తిలో 54 మిల్లిమీటర్లు, తలుపుల్లో 50.25 మిల్లిమీటర్లు, ఆమడగూరులో 42.5 మిల్లిమీటర్లు, నల్లచెరువులో 42 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. మరో రెండు,మూడు రోజులు వర్షాలున్నట్టు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు

వాగులు, చెరువుల్లోకి చేరుతున్న నీరు

వర్షాలు బాగా పడుతుండటంతో వాగులు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. కర్నాటకలోనూ అధిక వర్షాలు పడుతుండటంతో కర్నాటక దిగువనున్న ప్రాంతాల్లోకి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాయదుర్గం ప్రాంతంలో కర్నాటకలోని నీరు రావడంతో బళ్లారి రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డీ.హీరేహళ్ మండలంలోనూ సోములాపురం వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జిల్లా కలెక్టరు సూచించారు.

సాగుకు సమయత్తం

సీజన్ ప్రారంభంలోనే మంచి వర్షాలు పడుతుండటంతో రైతులు సాగుకు సమయత్తమవుతున్నారు. ఇప్పటికే వేరుశనగ విత్తన పంపిణీ జరిగింది. అంతరపంటల విత్తనాలను పంపిణీ చేపడుతున్నారు. మంచి వర్షాలొచ్చి పదును కావడంతో విత్తనం విత్తుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తిలో ఎడతెరిపి లేకుండా శుక్రవారం వర్షం కురిసింది. ఉదయం 12 గంటలకు ప్రారంభమైన వర్షం ఏకధాటిగా రాత్రి ఏడు గంటల వరకు కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. చిన్నచిన్న కుంటలలో, చెక్‌డ్యాముల్లో నీరు చేరుతోంది. రుతుపవనాలు ప్రవేశం తోనే వర్షాలు కురుస్తుండటంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతుంది. ఇలా ఉండగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లాలో 77.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యధికంగా తనకల్లు మండలంలో 72.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా తాడిమర్రి మండలంలో అత్యల్పంగా 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లాలో మొత్తం 32 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. మృగశిర కార్తెలో వస్తున్న ఈ వర్షాలకు రైతులు ఖరీఫ్ పంటలు పెట్టుకోవడానికి అనువుగా ఉంటుందని పొలాన్ని దుక్కి దున్నుపోవడానికి అవకాశం ఏర్పడిందని రైతులు తెలిపారు.

రొద్దం : రొద్దం మండల వ్యాప్తంగా వర్షం భారీగా కురిసింది. శుక్రవారం కురిసిన వర్షానికి మండలంలోని తురకల పట్నం నుంచి సానిపల్లికి వెళ్లే రహదారిలో వంకలు భారీగా ప్రవహిస్తున్నాయి. దీంతో వర్షపు నీరు మొత్తం తురకలాపట్నం చెరువులో చేరుతోంది. ఈ సీజన్ ప్రారంభంలోనే ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. మండల వ్యాప్తంగా రొద్దం. మరవ పల్లి, కందుకూర్లపల్లి, చిన్నకోడిపల్లి, గౌరాజుపల్లి, చుట్టుపక్కల గ్రామాలలో మూడు నాలుగు రోజుల నుంచి వర్షాలు పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బత్తలపల్లిలో కుండపోత వర్షం

బత్తలపల్లి : బత్తలపల్లి మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా బత్తలపల్లి మండలంలో కురుస్తున్న వర్షాలకు చిన్న కుంటలు, చెక్ డ్యాముల్లోకి నీరు చేరుతోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. తొలకరి వర్షాలకే వంకలు పారడం, చిన్న కుంటలు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి బత్తలపల్లి మండలంలో 88.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తోంది. పోట్లమర్రి ఈదుల వంక ప్రవహిస్తోంది. చెక్ డ్యాంలోకి నీరు వచ్చి చేరింది. మండలంలోని పలు గ్రామాల్లోని చెక్ డ్యాంల్లోకి నీరు వచ్చి చేరింది. ఇదిలా ఉండగా వరదాపురం, నల్లబోయనపల్లి, డి. చెర్లోపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా చిన్నపాటి వర్షం వస్తే చాలు రోడ్లు నీటికుంటలను తలపిస్తున్నాయి. బత్తలపల్లిలోని ఆర్కి ఫంక్షన్ హాల్‌కు వెళ్లే దారిలోనూ, టీచర్స్ కాలనీకి వెళ్లే దారితో పాటు పలు వీధుల్లో రోడ్డుపై నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మురుగు నీరు నిల్వతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది.



బత్తలపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



రొద్దం మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేద్దాం

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతు శ్రేయస్సే ధ్యేయంగా పని చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో రాయితీపై అంతర పంటల విత్తనాలు పంపిణికి సంబంధించి జిల్లా వ్యవసాయ అధికారి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, డివిజన్, మండల స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరై పలు ఆదేశాలు జారీ చేశారు. వేరుశనగ పంపిణీకి సంబంధించిన ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. వేరుశనగతో పాటు అంతర పంటలు కూడా సాగు చేస్తారు కాబట్టి ఆ విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయనిరైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా వారికి అవసరమైన విత్తనాలతో పాటు పచ్చి రొట్టె పైరులుకి సంబంధించిన విత్తనాలను అందుబాటులో ఉంచి త్వరలో వాటిని రైతులకు పంపిణీ చేయాలన్నారు. అవసరమైన విత్తనాలకు సంబందించిన వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి తీసుకొని వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి పంపించి వాటిని తెప్పించేలా చూడాలని సూచించారు. జిల్లాలో అంతర పంటల సరళి పై అధ్యయనం చేసి రైతులకు లాభాదాయకమైన అంతర పంటలను శాస్త్రవేత్తల ద్వారా సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో రైతు శిక్షణ కేంద్రం ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బందిని రైతులకు కొత్త అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఇతర జిల్లాలలో, రాష్ట్రాల్లో ఉన్న శిక్షణ కేంద్రాలకు కూడా పంపించి ఎప్పటికప్పుడు కొత్త అంశాలను క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వేరుశెనగ పంట ప్రధాన పంటగా సాగు అవుతుంది కాబట్టి ఈ వేరుశనగ పంట కొత్త రకాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. పలు అంశాలపై వ్యవసాయ పరిశోధన స్థానం, రేకులకుంట, కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కె-6 రకంతో పాటు గుజరాత్ గిరినార్ 4, 5 వంటి రకాలు కూడా మంచి దిగుబడి ఇస్తాయనివాటిని కూడా సాగు చేసే విధంగా రైతులలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ జిల్లాలో వేరుశనగ విత్తన పంపిణీకి సంబంధించిన అంశాలను, అంతర పంట విత్తనాలు కేటాయింపులు, పచ్చి రొట్టె పైర్ల సంబంధించిన విత్తనాల పంపిణీపై వివరించారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నివార్డుల్లో మురికి కాలువలను శుభ్రం చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు కోరారు. అమేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ ఇంజనీర్ గురప్పయాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గత కొద్దిరోజుల నుంచి వర్షాలు వస్తున్న నేపథ్యంలో కాలువలకు దివగకు ఉన్న ఇళ్లలోకి మురికి నీరు వస్తోందన్నారు. తద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో అనేక మంది అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. కావున అధికారుల సమస్యపై దృష్టి సారించి యుద్ధ ప్రాతిపదికన పట్టణంలో ఉన్న మురికి కాలువలను శుభ్రం చేయాలని కోరారు. ఇందుకు మున్సిపల్ ఇంజనీరు గురప్పయాదవ్ స్పందిస్తూ వీలైనంత త్వరగా గ్యాంగ్‌వర్కులు పెట్టించి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీసి వేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

నగర మేయర్ మహమ్మద్ వసీం



మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షాలను దృష్టిలో ఉంచుకుని వేగవంతంగా కాలువలల్లో పూడికతీత పనులను చేపట్టాలని అధికారులను సూచించారు. వర్షం నీటికి డ్రెయినేజీల్లో ఆటంకం లేకుండా ప్రవహించేలా ఎప్పటికప్పుడు పూడికతీతతో పాటు చెత్తాచెదారం తొలగించేలా నగరంలోని అన్ని సచివాలయాల శ్యానిటేషన్ సెక్రటరీలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడన్నా చెట్లు కూలితే వెంటనే తొలగించాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్య సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, బాలాంజినేయులు, అనిల్‌కుమార్‌రెడ్డి, సైపుల్లా, అదనపు కమిషనర్ హరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, ఇఇలు సూర్యనారాయణ, సుధారాణి, డిఇఇలు సుబాష్, చంద్రశేఖర్, శేఖర్, రవీంద్ర, ద్రాక్షాయణి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌ను కలిసిన శ్రావణిశ్రీ



చంద్రబాబుకు బొకే అందజేస్తున్న బండారు శ్రావణిశ్రీ

శింగనమల : అమరావతి నివాసంలోని టిడిపి అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేష్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, సోదరి బండారు కిన్నెరశ్రీ కలిశారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం వారి వద్దకు వెళ్లి పూలబొకేలు అందజేశారు. అనంతరం చంద్రబాబు, లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

9న పుస్తకావిష్కరణ

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మార్తాటి ఈశ్వరి గోపాలరావు రచించిన 'రైతు మారాజు' పుస్తకావిష్కరణ సభను ఈనెల 9న ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, శాంతి నారాయణ, ఏలూరు యంగన్న, తూముచర్ల రాజారామ్, సి.రాము, తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. కావున సాహితీవేత్తలు, సాహిత్య పెద్దలు, కవులు, కళాకారులు, సాహితీ ప్రేమికులు, విద్యార్థులు, పుర ప్రముఖులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జీడిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్



రిజర్వాయర్ బండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. జిల్లాలో హెచ్ఎన్ఎస్-ఎస్ సిస్టంలోని అంతర్భాగమైన జీడిపల్లి రిజర్వాయర్‌ను కళ్యాణదుర్గం ఆర్‌డిఒ రాణి సుస్మిత, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ దేశే నాయక్ తదితరులతో కలిసి రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్ బండ్‌పై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజి వన్ టైం సెటిల్మెంట్ కింద మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించిన నేపథ్యంలో వాటి వివరాలు ఆరా తీశారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలు కావడంతో హెచ్ఎల్‌సి, హెచ్ఎన్ఎస్ఎస్ కింద రాబోయే జూలై, ఆగస్టు, మార్చిలో నీటి విడుదల ప్రక్రియపై పరిశీలన చేయడం కోసం రిజర్వాయర్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3 టిఎంసిల నీటి నిల్వ ఉండగా, ప్రస్తుతం స్థానికంగా 150 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. జిల్లాలో మే నెలలో వర్షం అధికంగా వచ్చిందని, ఈ నెలలో కూడా ఎక్కువ వర్షపాతం వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రిజర్వాయర్ ఇన్ ఫ్లో, అవుట్‌ఫ్లో ఎంత వస్తుందన్న వివరాలను ఆరా తీశారు. రిజర్వాయర్ ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో, నీటి విడుదలపై హెచ్ఎన్ఎస్ఎస్ ఏఈలు, డిఇలు, ఈఈలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బండ్ అలైన్మెంట్, ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో రెగ్యులేటర్, పంప్ హౌస్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ శ్రీనివాస నాయక్, డీఈలు వెంకటేశ్వర్లు, విశ్వనాథరెడ్డి, జేఈ కలందర్, ఏఈఈలు నాగస్వాతి, షఫ్రుద్దీన్, ఎంపీడీవో సుబ్బరాజు, డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరిజిస్టర్ పక్కాగా ఉండాలి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని ప్రతి ఒక్క రిజిస్టర్ పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం బెలుగుప్ప మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రిజిస్టర్లు అన్ని సక్రమంగా మెయిన్‌టైన్ చేయాలన్నారు. కార్యాలయంలో పలువురు ఉద్యోగులు విధులకు గైర్హాజరైన విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రికార్డులన్నీ పకడ్బందీగా ఉండాలని, నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు.కార్యాలయం సిబ్బంది అందరూ ఐడి కార్డులను తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్ పీరా, సిఎస్‌డిటి, సీనియర్ అసిస్టెంట్ శర్మ, వీఆర్వోలు గోవిందు, ఎర్రి స్వామి, రాజశేఖర్, హనుమంతరావు, చంద్రశేఖర్, కార్యాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - రాయదుర్గం

కర్నాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు బళ్ళారి- రాయదుర్గం మార్గంలో రహదారిమీద రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం పులకుర్తి క్రాస్ వద్ద వంకలో భారీ ఎత్తున వరద నీరు ప్రవహిస్తుండడంతో రాయదుర్గం- బళ్ళారి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అంబులెన్స్ తో సహా అనేక వాహనాలు వంకకు ఇరువైపులా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవలే సోమలాపురం వద్ద గంగమ్మ వంక ప్రవహించడం వల్ల కొన్ని గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇలా తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయాలు కలగకుండా బళ్లారి రోడ్డు మార్గంలో వంకలు, వాగులు, నదులపై వంతెనలు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 24 రోజులు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసాయి. ఇందులో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా ఆధ్వర్యంలో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ కల్పనాధికారి ఏ.కళ్యాణి, పురావస్తు శాఖ ఏడి డాక్టర్ వి.రజిత, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సామాజిక కార్యకర్త రవికాంత్ రమణ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి, సుంకర రమేష్, సామాజిక కార్యకర్త సుంకర రమేష్, గ్రంథాలయ సంస్థ సిబ్బంది ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, బాషా, ఉజ్జినేశ్వర, ముత్యాలమ్మ, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లులో బహుమతులు అందుకున్న విద్యార్థులు

గుంతకల్లు : పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో 22 రోజులుగా గ్రంథాలయ అధికారి కమ్మన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. సెలవుల్లో సమయం వృథా కాకుండా వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి, చదువుపై ఎక్కువ శ్రద్ధ వహించడానికి ఉపయోగపడుతున్నాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవడం వల్ల వారు విద్యలో ఉన్నత స్థాయికి చేరుకుని ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. పిల్లలకు పాఠశాల సమయం కాకుండా మిగిలిన సమయాల్లో గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తర్వాత శిక్షణ శిబిరంలో స్వచ్ఛందంగా సేవలు అందించిన శిక్షకులు, ముఖ్య అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు సరస్వతి, సుప్రసిద్ధ చిత్రకారుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డ్ గ్రహీత కె.శ్రీధర్, తెలుగు భాష శిక్షకులు రఘుకుమార్, ఆంగ్లభాష శిక్షకులు సిరాజుద్దీన్, గణిత శిక్షకులు ఈశ్వర్, డాన్స్ మాస్టర్ రమేష్, గ్రంథాలయ సహ అధికారిణి హేమలత, రికార్డు అసిస్టెంట్ రాము, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ శిబిరంలో వేసవి సెలవుల్లో దాదాపుగా 30 మంది విద్యార్థులు 15 రోజులపాటు పాల్గొని చదువుతోపాటు, మంచి చేతిరాత, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, క్యారం బోర్డ్, వివిధ రకాల ఆటల పోటీల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, రమేష్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, గాదిలింగ గౌడ్, లక్ష్మీకాంతరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని జూనియర్ కళాశాల లెక్చరర్ రేణుకాదేవి అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆధ్వర్యంలో గతనెల 15 నుంచి ఈనెల 7వతేదీ వరకూ నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ముఖ్యంగా ఇలాంటి శిబిరాల వల్ల విద్యార్థుల్లోని మేథోశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల లెక్చరర్ సావిత్రి, గ్రంథాలయం అధికారిణి ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని గ్రంథాలయం కార్యాలయంలో మే 15 నుంచి ఈనెల 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఇందులో భాగంగా గ్రంథాలయ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఏఎస్ఐ చిదంబరం, వైస్ సర్పంచి లక్ష్మీనారాయణ, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి యోగేశ్వర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో 21 రోజులు పాటు జరిగిన వేసవి విజ్ఞాన ఉచిత శిబిరాలు శుక్రవారం ముగిశాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీల నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులు, విశ్రాంత గ్రంథాలయాధికారి ఎసి సుబ్బన్న, సిద్ధార్థ్, సాయి, రాఘవ, జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పిల్లలు అభివృద్ధి చెందాలంటే పుస్తక పఠనం చాలా అవసరమని ఎంఇఒ రాముడు, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 21రోజులపాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదవడం చిత్రలేఖనం, మ్యూజికల్ ఛైర్స్, చెస్ లాంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, విద్యార్థులు, పాల్గొన్నారు.


విద్యార్థి హరినాథ్‌కు బహుమతి అందజేస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన ఓబయ్య

రాయదుర్గం : పట్టణంలోని బిటిపి రోడ్డు మోడల్ కాలనీ లేఅవుట్ వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం నల్ల రాళ్ల తిమ్మాపురం గ్రామానికి చెందిన ఓబయ్య రాయదుర్గం పట్టణ పొలిమేరలో మోడల్ కాలనీలో ఉన్న తన కుమార్తె సాకమ్మను పరామర్శించేందుకు బస్సు దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయం తగిలింది. వెంటనే అతడిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఓబయ్య మృతి చెందాడు. కాగా మోడల్ కాలనీ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వేగంగా వస్తున్న వాహనాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల నివారణకు అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మిగులు సీట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : 2024-25వ విద్యా సంవత్సరానికి పుట్లూరు ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతిలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని పుట్లూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 12వతేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకుని 13న జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కందుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

శింగనమల : కందులు కావాల్సిన రైతులు ఆయా ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని తీసుకెళ్లవచ్చని ఎఒ అన్వేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు కిలోల కందుల ప్యాకెట్ రూ.392 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీ అంబికాను కలిసిన చంద్రమోహన్

శింగనమల : అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్, నాయకులు పెద్దనాగమణి, చినరాయుడు, రాజబాబు, ప్రకాష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడం, తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం శుభ పరిణామం అన్నారు. ఇది తెలుగు ప్రజల విజయం అన్నారు. అదేవిధంగా శింగనమల ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ గెలవడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయదుర్గం : రాష్ట్రంలో టిడిపి అఖండ విజయం సాధించడంతోపాటు ఆ పార్టీ నాయకులు శుక్రవారం పట్టణంలోని 2వ వార్డులో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, సామూహిక లలితా సహస్ర నామపారాయణం, కుంకుమార్చన చేశారు. తర్వాత 101 టెంకాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు టిడిపి పెద్దలు వడ్డే శ్రీనివాసులు, వార్డు ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన నల్లాని రాజేశ్వరి

అనంతపురం : ఎన్‌డిఎ కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ప్రముఖ విద్యావేత్త, ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నల్లాని రాజేశ్వరి శుక్రవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా లోకేష్‌ను దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని ఇవ్వడంతో లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సిఇఒ గుత్తా హరి, తదితరులు పాల్గొన్నారు.

మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలో దేశంలో ఎన్డీఏ కూటమి గెలుపనకు కృషి చేసినందుకు కృతజ్ఞతగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంద క్రిష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపే లక్ష్యంగా గ్రామ స్థాయిలో ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు, నాయకులను ఏకతాటిపై నడిపి ఓట్లు వేయించగలిగారన్నారు. ఆ ఫలితంగా ఎన్‌డిఎ కూటమి దేశంలో, రాష్ట్రంలో అధికారం చేపట్టబోతున్నాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధన ఎన్డీఏ కూటమి గెలుపుతోనే సాధ్యమవుతుందని నమ్మి గెలిపించుకునేందుకు అహర్నిశలు కష్టపడ్డారని కొనియాడారు. అందుకు జిల్లాలోని ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడ్డారని అభినందించారు. రాబోయే రోజుల్లో అన్ని మంచి జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నిన్నటి రోజున ఎస్‌కెయు విసిపై దురుసుగా వ్యవహరించిన తీరును ఆయన తప్పు పట్టారు. ఇలాంటివి సరికాదని హితవు పలికారు.

టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కలెక్టరేట్ : భారత యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ 2023వ సంవత్సరానికి టాన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు (టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వాన్చర్ అవార్డ్ (తానా) కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆన్‌సెట్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కరుణకుమారి తెలిపారు. 2021, 22, 2023 సంవత్సరాల్లో భూమి, నీరు (సముద్రం), గాలి, వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాహస క్రీడల్లో తమను తాము అంకితం చేసుకుని, నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ఏటా రాష్ట్రపతి చేతుల మీదుగా బహుకరిస్తారని తెలిపారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసా పత్రం రూ.15 లక్షల నగదు అందిస్తారన్నారు. ఈ అవార్డు కోసం ఆన్‌లైన్ వెబ్‌సెట్ htts//awards.gov.in ద్వారా ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రజల అభ్యున్నతికి కృషి

టిడిపి నాయకులు గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి-గుత్తి


మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కృషి చేస్తారని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్, ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సుయాత్ర చేసే సమయంలో తమ అధినేత చంద్రబాబుపై వై.వెంకట్రామిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అరాచకాలు, దౌర్జన్యాలు, అవినీతి అక్రమాలు పెరిగిపోయాయన్నారు. వాటిని ఐదేళ్లపాటు భరించిన ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌తోపాటు ఆ పార్టీ నేతలకు తగిన బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని చెరువులన్నిటినీ నీటితో నింపుతామన్నారు. గుత్తిలో నెలకొన్న తాగునీరు, డ్రెయినేజీ, మార్కెట్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబుతో తమ సోదరుడు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ చర్చించి పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.173 కోట్లతో మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయిస్తారన్నారు. 45 రోజుల్లోనే తమను ఆదరించి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు గుమ్మనూరు కుటుంబ సభ్యులు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జింకా నారాయణస్వామి, టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, నాయకులు శ్రీకాంత్‌చౌదరి, ఎన్.కేశవనాయుడు, ఎంకె.చౌదరి, బర్దివలి, దిల్కా శీనా, పి.నారాయణస్వామి, ప్రతాప్, న్యాయవాది సోము, చిన్నరెడ్డియాదవ్, జీపు రామకృష్ణ, చిన్న వెంకటస్వామి, పిల్లెల్లి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో తనిఖీ


ఆర్టీసీ డిపోను తనిఖీ చేస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

రాయదుర్గం : స్థానిక ఆర్టీసీ డిపోను ఎపిఎస్, ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డిపోలోని గ్యారేజ్, ట్రాఫిక్, డిపో మేనేజర్ ఆఫీస్, కార్గో విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాయదుర్గం డిపో గ్యారేజీ ఆవరణలో మొక్క నాటి పరిరక్షించాలన్నారు. కాగా ఆర్టీసీ బస్టాండ్ పైకప్పు శిథిలావస్థలో ఉండగా మరమ్మతు చేసేందుకు అవసరమైన అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. డిపో పరిధిలో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిపో మేనేజర్ సురేష్‌కుమార్ కోరారు. బస్టాండ్, గ్యారేటీల్లో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల అవసరాలకు కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు బొకే అందజేస్తున్న ఉద్యోగ ఉపాధ్యా సంఘాల నాయకులు

కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అభినందన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 సజావుగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యా సంఘాల నేతలు ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై కలెక్టర్‌ను కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో లేని విధంగా ఈ ఎన్నికల్లో సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఏర్పడిన ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కారం చేసారని, ఎన్నికలను సిబ్బంది అధికారులు స్నేహపూరిత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేలా కలెక్టర్ చొరవ చూపించినందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఎన్నికల సమయంలో వివిధ కారణాల చేత సస్పెండ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను విధులలోకి తీసుకోవాలని, బూత్ లెవల్ ఆఫీసర్‌లకు గౌరవ వేతనం చెల్లించాలని, ఎన్నికల రెమ్యూనరేషన్ అసమానతలు తొలగించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.ఎర్రిస్వామి, రాష్ట్ర కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, ఎస్ఎల్‌టిఏ జిల్లా అధ్యక్షులు వై.ఆదిశేషయ్య, డిటిడబ్ల్యూఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాగరాజు, జోషి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సాధనకు కృషి చేయాలి

రాయదుర్గం : రాష్ట్రంలో త్వరలో ఏర్పడనున్న టిడిపి ప్రభుత్వం సాగు, తాగునీటి సాధనకు కృషి చేయాలని భారత యువజన చైతన్య పార్టీ రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి గౌనీ ప్రతాపరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా తాగు, సాగునీటి సాధనతోపాటు, సర్వతోముఖాభివృద్ధి సాధనే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు పని చేయాలన్నారు. గతంలో శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహించినపుడు రాయదుర్గం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం కొన్ని రూ.వందల కోట్లు విడుదల చేయించి 50 నుంచి 90 శాతం పనులు చేశారన్నారు. అయితే ప్రభుత్వం మారాక అవన్నీ కుంటుపడ్డాయన్నారు. ప్రస్తుతం కాలవ శ్రీనివాసులు తిరిగి గెలిచిన నేపథ్యంలో ఆయన శక్తిసామర్థ్యాలను వినియోగించి త్వరితగతిన పూర్తి చేసి చేయాలని కోరారు. ముఖ్యంగా మల్లాపురం గ్రామ సమీపంలో నెలకొల్పిన టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని, గుమ్మఘట్ట మండలంలో అర్థాంతరంగా వదిలేసిన బీసీ బాలికల సంక్షేమ హాస్టల్, గురుకుల పాఠశాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అలాగే గురువారం వచ్చిన భారీ వర్షం వల్ల రాయదుర్గంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయన్నారు. ముంపు ప్రాంతాల అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.20కోట్లకుపైగా నిధులు కేటాయిస్తున్నట్లు జీఓ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తక్షణమే ఆ నిధులు విడుదల చేసి పట్టణ ప్రజల కష్టాలను తీర్చాలని ప్రతాపరెడ్డి సూచించారు.

ప్రజాభిమానాన్ని చూరగొన్న 'గుమ్మనూరు'


కార్యక్రమంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

పామిడి : గుంతకల్లు నియోజకవర్గంలో అతి తక్కువ సమయంలోనే ప్రజల ప్రేమాభిమానాన్ని చూరగొన్న నాయకుడు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అని జనసేన మండల అధ్యక్షులు ధను అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుమ్మనూరుపై ఎన్నో అపోహలు సృష్టించినా మొక్కవోని ఆత్మవిశ్వాసం, ధైర్యంతో ఎన్నికల సమరంలో దిగి విజయం సాధించారని కొనియాడారు. ఎవరు ఎన్ని రకాలుగా తనపై తప్పుడు కథనాలను సృష్టించిన జయరామ్ మాత్రం తన ప్రేమ, ఆప్యాయత మంచితనంతో ప్రజల మద్దతు కూడగట్టుకున్నారన్నారు. అలాంటి గొప్ప నాయకుడికి తమవంతుగా పవన్‌కళ్యాణ్ మాట కోసం శక్తివంచన లేకుండా పని చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జగదీష్, వేణుగోపాల్, రాము, లాలుస్వామి, పెన్న ఓబులేసు, మురళి, షేక్షావలి, శ్రీనివాసులు, ఖాజావలి, రోషన్‌జమీర్, సిద్ధ, రాజు, నబిరసూల్, సల్మాన్, అఫ్జల్, రమేష్, పవన్, జనసేన నాయకులు, కార్యకర్తలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డు నామినేషన్‌కు ఆహ్వానం

అనంతపురం కలెక్టరేట్ : భారత ప్రభుత్వం హోం మంత్రిత్వ శాఖ వారు రిపబ్లిక్ డే సందర్భంగా 2025 సంవత్సరానికి గాను పద్మ అవార్డ్ కోసం నామినేషన్‌లు ఆహ్వానిస్తున్నట్లు ఆన్‌సెట్ జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.కరుణ కుమారి శుక్రవారం తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక, సాంఘిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా సంబంధాలు, సివిల్ సర్వీసెస్, ట్రేడ్, ఇండస్ట్రీ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన వారు అవార్డులకు అర్హులు అన్నారు. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రీయ పురష్కార్ పోర్టల్ https//awards.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఎస్‌కెయులో వైఎస్ విగ్రహం తొలగింపు అప్రజాస్వామికం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని రీతిలో టిడిపి నేతలు విగ్రహాల తొలగింపు సంస్కృతికి తెర లేపుతున్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి ఎందరో పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. అలాగే విద్యావ్యవస్థ బలోపేతం కోసం కృషికి గుర్తింపుగా ఎస్‌కెయులో పాలకమండలిలో తీర్మానం చేసి వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన కొన్ని గంటల వ్యవధిలోనే టిడిపి నేతలు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పాలకమండలిపై ఒత్తిడి తీసుకొచ్చి ఆఘమేఘాలపై వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించే తీర్మానాన్ని ఆమోదింపజేయడం అప్రజాస్వామికమన్నారు. గత టిడిపి పాలనలో జెఎన్‌టియులో ఎన్టీఆర్ ఆడిటోరియం ఏర్పాటు చేయడంతోపాటు ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అయితే తాము ఏనాడు ఆ విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాన్ని చేయలేదని గుర్తు చేశారు. అందుకు భిన్నంగా టిడిపి నేతలు ప్రమాణ స్వీకారం కూడా చేయకనే యూనివర్సిటీలో రాజకీయాలు చేయడం దుర్మార్గకరమన్నారు. ప్రజలకు మేలు చేసేందుకు ఎన్నికలలో ప్రజలు అవకాశం కల్పిస్తే అందుకు భిన్నంగా టిడిపి నేతలు కక్ష సాధింపు ధోరణిని అవలంబిస్తున్నారనివిమర్శించారు. యూనివర్సిటీలో వైఎస్ఆర్ విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


హుసేన్‌పీరాను పరామర్శిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

హుసేన్‌పీరాకు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న అనంతపురం వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుసేన్‌పీరాను అనంత వెంకటరామిరెడ్డి పరామర్శించారు. అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న వెంకటరామిరెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

విజయవాడలో 'దగ్గుపాటి' బిజీ..బిజీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుక్రవారం విజయవాడలో బిజీబిజీగా గడిపారు. మంగళగిరి ఎమ్మెల్యే, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తోపాటు పలువురు సీనియర్ నాయకులను దగ్గుపాటి కలిశారు. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో లోకేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం అర్బన్‌లో స్వల్ప వ్యవధిలోనే భారీ మెజార్టీతో విజయం సాధించడంపై లోకేష్ దగ్గుపాటిని లోకేష్ అభినందించారు. ఎన్నికల్లో చాలా బాగా పని చేశారని కితాబిచ్చారు. నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాల గురించి దగ్గుపాటి వివరించారు. ఆ తర్వాత టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ని కలిశారు. విజయవాడలోని పయ్యావుల కేశవ్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం అర్బన్‌లో మంచి విజయం సాధించారని అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ కోవెలమూడి నాని(రవీంద్ర)ని కూడా కలిశారు. విజయవాడలోని వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో మీరంతా ఎంతో సహకారం అందించారని దగ్గుపాటి వారికి కతజ్ఞతలు తెలిపారు. దగ్గుబాటితో పాటు అనంతపురం నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, టిడిపి నాయకుడు గంగారామ్ తదితరులు ఉన్నారు.


లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దగ్గుపాటి ప్రసాద్

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభంజనం సృష్టించడంతో శుక్రవారం గుత్తిలో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ముందుగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో భారీ కేక్ కోసి పంచిపెట్టారు. గాంధీ విగ్రహం వద్ద బాణాసంచా పేల్చారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణ నాయకులు కార్యకర్తలు శాలువాలు, పూలమాలతో సత్కరించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలకు గుమ్మనూరు కుటుంబం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామచంద్ర యాదవ్, కరిడికొండ సుధాకర్‌నాయుడు, పి.ప్రభాకర్, పి.సుధాకర్, మందల నాగరాజు, తపిల సుధాకర్, అబ్దుల్ వహాబ్, జక్కా వీరన్న, భాస్కర్‌స్వామి, ఎం.రాము, కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టిడిపి నేతలు

In the Court of the Ist Addl. Distict Judge, Ananthapuramu.
E.A.No. 43/2022 in E.P. No.1015/2018 in O.S. No.46/2015

Between:
Karanam Syamala ... **Petitioner/Claimant**
And
Union of India, Rep.by its Superintendent of Post-Office, Dept. of Post Office, Ananthapuramu and Others ... **Respondents/J.Drs.**

Notice to J.Dr. No.6 and 7

J.Dr6: Anke Obulesu Father's Name not Known
J.Dr7: Anke Kumar Father's Nme not Known
Both are R|of D.No.6-4-588, Mangalavari Colony, Maruthi Nagar, Ananthapuramu.

పై నెంబరు E.A. 43/2022లో J.Drs. అయిన మీ హాజరు నిమిత్తం 18-06-2024వ తేది ఉదయం 10:30గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఇట్లు:
భాస్కర రవి ప్రసాద్
అడ్వకేటు, అనంతపురము, సెల్: 9849663288

In the Court of the Hon'ble Ist Addl Junior Civil Judge: Cum: Ist Addl J.F.CM:: Ananthapuramu.
O.S.No. 87/2023

Between:
A. Venkata Ramana ... **Plaintiff**
And
P. Ramesh Babu ... **Defendent**

Notice to Defendent

Sri P.Ramesh Babu S/o.P.Ramachandra, H.No.6-2-731-A, Ram Nagar, Ananthapuramu.

ఇందుమూలముగా తెలియజేయడమేమి ఏమనగా ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు నందు 19-06-2024వ తేదీ వాయిదా వున్నది. కావున పై తేదీ రోజు ఉదయం 10-30గం॥లకు స్వతహాగా కాని వకీలు ద్వారా కాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు.

|| By Order of the Court ||

S.MD. Saifullah,
Chittoor Waheedulla Khan,
Advocates, Ananthapuramu.
Cell: 8919432501

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE ::GOOTY
S.O.P. No. 08/2024

Between:
1] Sarai Venkatesulu
2]Pandikunta Venkatarathnamma
...**Petitioners**
And
1] Snit. B.T.Veena @ Srivani
2]M/s Cholamandalam MS General Insurance Co. Ltd., Rep. by its Authorized Signatory, Ananthapuramu.
3]The Road Transport Authority, Road Transport Office (RTO), Guntakal, Ananthapuramu Dist.
...**Respondants**

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై అర్జీదారులు తమ కుమారుడైన లేట్ సురేష్ బాబు చనిపోయినందున ఆయనకు 6వ అదనపు జిల్లా కోర్టు, గుత్తి నందు M.V.O.P. No. 76/2021 నందు రావలసిన రూ.6,50,000/-లు, మీమే వారసులమని గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు అర్జీ వేసి, రూ.6,50,000/-తమకే చెల్లించవలయునని పై కోర్టు నందు అర్జీ దాఖలు చేసుకున్నాము. సదరు అర్జీలో ప్రతివాదులుగా శ్రీమతి బి.టి.వీణ @ శ్రీవాణి, M/s Cholamandalam MS General Insurance Co. Ltd., మరియు The Road Transport Authority, Road Transport Office (RTO) ప్రతివాదులుగా చేర్చి సదరు అర్జీని కోర్టు వారు 25/06/2024 వ తేదికి వాయిదా వేసినారు. మరియు ఈ అర్జీలో ఇంకా ఎవరికైన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో 25/06/2024 వ తేది ఉదయం 10:30 గంటలకు హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకో వలెను.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
B. Narayanappa,
A.Suryanarayana,
Advocates for the Petitioners, Gooty.